# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 06 శుక్రవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 32

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




3లో

పార్టీల మధ్య గీతం, తెలంగాణ తల్లి విగ్రహం లొల్లి



## ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో

# కేటాయిస్తాం

- అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత
- వారికి మొదటగా ఇండ్ల కేటాయింపు
- ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల కేటాయింపు
- మొత్తంగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణం
- ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులు


2లో

పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చేశాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి లబ్ధిదారుల ఎంపిక ప్రత్యేక మొబైల్ యాప్ ఎంపికపై ప్రభుత్వం కీలక నిర్ణయం సచివాలయంలో యాప్‌ను ఆవిష్కరించిన సీఎం



2లో

## ఇందిరమ్మ ఎమర్జెన్సీలా ఉంది రాష్ట్రం : కవిత



2లో

## నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

- ప్రజలకు చట్టాలంటే భయం లేదు..
- ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించలేం
- ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి
- ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య పెరిగిపోతోంది
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన

## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్..

### హైకోర్టు కీలక ఆదేశాలు



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో (%ువశ్రీఖఅస్త్రఖఆ ఎఅస్త్రష్ట జశీబతీ%) విచారణ జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనల్లో నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.భోజనం వికటించిన ఘటనల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు ఏఏజీ తెలిపారు. బాధ్యులైన వాళ్లను ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యమైన భోజనం అందించడానికి ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. మరోవైపు పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పీఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలుండాలని చెప్పారు. కమిటీల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. దీనికి బదులిస్తూ.. అన్ని కమిటీలు పని చేస్తున్నాయని ఏఏజీ తెలిపారు. దీంతో ఏఏజీ చెప్పిన వివరాలను హైకోర్టు నమోదు చేసింది.పురపాలికల్లో గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమం

గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం విలీనం జరిగిందని చెప్పింది. పాలనలో భాగంగా చట్టాలను తీసుకొచ్చే అధికారం అసెంబ్లీకి ఉందని పేర్కొంది.రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామపంచాయతీలను ఇటీవల పురపాలికల్లో విలీనం చేశారు. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. దీంతో పురపాలికల్లో గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమమైంది.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణ స్వీకారం

డిప్యూటీలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణం



2లో

## ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు

- మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్
- హరీష్‌తో పాటు కౌశిక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హరీశ్‌రావును గచ్చిబౌలి పీఎస్‌కు తరలింపు
- ఇది ప్రజాస్వామ్య పాలన కాదు..
- రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన..!

రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులా..? మా నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలి రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం



2లో

## లోక్‌సభ వాయిదా



న్యూఢిల్లీ,:స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం జీరో అవర్‌ను ప్రారంభించగా.. విపక్ష సభ్యులు లేచి నిలబడి, సంభాల్ హింసాత్మక పరిస్థితులపై సభలో చర్చించాలని పట్టుబట్టారు.దూబే తన ప్రజెంటేషన్‌ను పూర్తి చేసిన తర్వాత సంభాల్ సమస్యను పరిష్కరించడానికి ప్రతిపక్షాలకు అనుమతి ఇస్తామని స్పీకర్ బిర్లా హామీ ఇచ్చారుఅయినప్పటికీ విపక్షాలు వినకపోవడంతో లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.ప్రతిపక్ష పార్టీల తీరుతో చాలా బాధపడ్డాను: కిరన్ రిజుజుశీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీల తీరుతో చాలా బాధపడ్డాను.తొలి రోజు నుంచే బిల్లులు, రాజ్యాంగంపై చర్చ వంటి ముఖ్యమైన అంశాలపై చర్చించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీలో నిర్ణయించాం. కానీ కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు ఎందుకు నిరసన చేస్తున్నాయి. సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించి పార్లమెంట్ వెలుపల ఎందుకు నాటకాలాడుతున్నారు. ఇదనే సభ నడిచే తీరుబీ పార్లమెంట్ హౌస్ అంటే చర్చలు జరగాలి. కానీ వారు రంగురంగుల బట్టలు వేసుకుని పార్లమెంట్ హౌస్ చుట్టూ తిరుగుతున్నారు.భారతదేశం వెలుపల కొన్ని గ్రూపులు పన్నిన కొన్ని కుట్రల గురించి, భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రత ప్రయోజనాలపై దాడి చేయడంపై నేడు మన ఎంపీలలో కొందరు చాలా ముఖ్యమైన అంశాన్ని లేవనెత్తారు. ఇవి చాలా తీవ్రమైన విషయాలుకానీ ప్రతిపక్షాలు భారత ప్రభుత్వానికి సంబంధం లేని మరికొన్ని సమస్యల గురించి మాట్లాడుతున్నారు. ఏదో సమస్యలను లేవనెత్తుతూ పార్లమెంటు ఆవరణ చుట్టూ తిరుగుతున్నారు. నేను ప్రతిపక్ష పార్టీలతో చాలా బాధపడ్డాను' అని రిజుజు అన్నారుసంభాల్ హింసాకాండ, బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై గందరగోళం మధ్య లోక్‌సభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడ్డాయి.ప్రతిపక్షాలు అన్ని చోట్లా ఓడిపోతాయి: బీజేపీ ఎంపీ రవికిషన్'హర్యానాలో ఓడిపోయారు. మహారాష్ట్రలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నారు. రానున్న రోజుల్లో అన్ని చోట్లా ఓడిపోతారు. అందుకే వారి బాధ ఇక్కడ చూపిస్తున్నారు' అని కిషన్ అన్నారు.మధ్యాహ్నం 12 వరకు రాజ్యసభ వాయిదాపార్లమెంట్ శీతాకాల సమావేశాలు గురువారం రోజు ప్రారంభమయ్యాయి.అదానీ వ్యవహారంపై లోక్‌సభ రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ మేరకు పార్లమెంట్ ఆవరణలో రాహుల్

మాట్లాడుతూ..

అదానీ వ్యవహారంపై ప్రధాని మోదీ విచారణ జరపలేరని అన్నారు. ఎందుకంటే అలా చేయాలంటే తనను తాను దర్యాప్తు చేసుకున్నట్లే అవుతుందని విమర్శించారు.మోదీ ఔర్ అదానీ ఏక్ హై. దో నహీ హై, ఏక్ హై(మోదీ, అదానీ ఒకటే.. ఇద్దరు కాదు)అని పేర్కొన్నారు.కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ గురువారం లోక్‌సభలో 'ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ప్రాథమిక హక్కుల తిరస్కరణ'పై చర్చను కోరుతూ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# సీఎం రేవంత్ పగ పట్టారు

మాజీ మంత్రులు హరీశ్‌రావు జగదీశ్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భారాస కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేటు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు యత్నించారు. ఆ తర్వాత కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకు దిగిన భారాస నేతలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



హైదరాబాద్: కాంగ్రెస్ పగ, ప్రతీకారాలతో పనిచేస్తోందంటూ మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. తెలంగాణలో అసలు ప్రజాస్వామ్యం ఎక్కడుంది అంటూ ప్రశ్నించారు. గురువారం రాత్రి గచ్చిబౌలి పీఎస్ నుంచి విడుదలైన అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్‌లు పోలీస్‌స్టేషన్ నుంచి కాదు.. గాంధీభవన్ నుంచి వస్తున్నాయంటూ నిప్పులు చెరిగారు.రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి లేదు. అక్రమ కేసులు, అక్రమ సంపాదనపైనే ఆయన దృష్టి. ప్రశ్నించే వారి గొంతు నొక్కాలని చూస్తున్నారు. వందరోజుల్లో హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై సంతకాలు చేసి. ప్రజల కాళ్లా వేళ్లా పడి ఓట్లు వేయించుకున్నారు. ఆ హామీలు అమలు చేయాలని మేం అడుగుతున్నాం.. తప్పా?. రేవంత్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు. అవ్వాతాతలకు 4వేల పెన్షన్ ఇస్తానన్నావ్ ఎప్పుడిస్తావ్?. మూసీలో పేదల ఇళ్లు కూలగొట్టొద్దన్నారు. ఇది సూచన కాదా?. సూచనలు తీసుకునే సోయి నీకు లేదు. గల్లీ నాయకుడిలా, ముఠా నాయకుడిలా కక్షతో రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారు" అంటూ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, అంతకు ముందు మాజీ మంత్రి హరీష్‌రావును విడుదల చేయాలంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ దగ్గర బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొన్ని గంటల పాటు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్న హరీశ్‌రావును ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు, బీఆర్ఎస్‌నేతలు కలిశారు. కేసీఆర్ కట్టించిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించకుండా రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగిన తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన హరీష్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాం




హైదరాబాద్: ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే లబ్ధికారుల ఎంపికపై ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించి ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గురువారం తెలంగాణ సచివాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఇండ్ల లబ్ధికారుల ఎంపికపై సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు విధించారు. ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం ఎంత గొప్పదైనా.. అమలులో లోపాలుంటే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. పేదవారికి అన్యాయం జరుగుతుంది. అందుకే సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి ఇళు అనర్హులకు చెందకూడదని ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తెచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తామని.. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కింద ఇండ్ల కేటాయింపు జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్... ఈ క్రమంలో ప్రాధాన్యత ఇస్తూ ఇండ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని గరిష్టస్థాయిలో వినియోగించుకుని నిర్మించుకునేలా.. ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి చూపిస్తామని రేవంత్ వివరించారు. అచ్చం అలాగే కట్టాలని కాకుండా అవగాహన కోసం మాడల్ హౌజ్‌ను చూపిస్తామని చెప్పారు. మొదట ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల కేటాయింపు ఉంటుందని రేవంత్ స్పష్టం చేశారు. మొత్తంగా 4.50 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. ఆదివాసీలు, ఆదివాసీ తండాలు (ఐటీడీఏ తండాలకు) జనాభా ప్రాతిపదికన ప్రత్యేకంగా పరిశీలించి అదనంగా కొన్ని వేల ఇండ్లను నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. ఇప్పుడు కేటాయించిన ఇండ్లు కాకుండా ఆదివాసీలకు ప్రత్యేక కోటా ఇస్తామని చెప్పారు. గతంలో రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకున్న 7 వేల కుటుంబాల రుణాలను కూడా.. ప్రభుత్వం తీర్చి వారిని రుణ విముక్తులను చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. పెరిగిన ధరలు, పేదవాడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇండ్లు కట్టుకోవడానికి అండగా నిలవాలని.. ఈ పథకం తీసుకొచ్చినట్టు సీఎం వివరించారు. అందుకే ప్రతి పేద వాడికి 5 లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టుకోవడానికి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకంలో పేదలకు వెసులుబాటు కల్పిస్తూ విధివిధానాలను నిర్ణయించామని సీఎం రేవంత్ చెప్పారు. అదనంగా ఒక గది కట్టుకుంటామంటే అందుకు వెసులుబాటు కల్పించామని వివరించారు. ఇదొక పండగ సందర్భమని.. ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆత్మగౌరవంతో బతకాలన్నది ప్రతి ఒక్కరి కల అని.. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటిముందు వెలుగుల్లో పండగ చేసుకునే సందర్భమిదని అభిప్రాయపడ్డారు. కాగా తెలంగాణలో తొలిసారిగా అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి కావొస్తోంది. గత ఏడాది డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగా.. 9వ తేదీన కాంగ్రెస్ సర్కార్ పీఠమెక్కింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధానంగా ఆరు గ్యారెంటీలను ప్రస్తావించింది. కాంగ్రెస్ ప్రకటించిన 'సిక్సర్' వర్కౌట్ కావటంతో%ొ%

తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్%ొ% ప్రధానంగా ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకం కూడా ఆరు గ్యారెంటీల హామీలపైనే చేశారు. అంతేకాదు%ొ% సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ జరిగింది. ఇందులో కూడా ఆరు గ్యారెంటీల హామీల అమలుపైనే చర్చించారు. పథకాల అమలు కోసం ప్రజా పాలన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.

# ఇందిరమ్మ ఎమర్జెన్సీలా ఉంది రాష్ట్రం : కవిత



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతల అరెస్టులపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది ప్రజా పాలన కాదు.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన మా పార్టీ సీనియర్ నేతలను తక్షణమే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీని కవిత డిమాండ్ చేశారు.

# నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య ఏటికేడు పెరుగుతోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలంటే ప్రజలకు భయం లేకుండా పోయిందన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల నిత్యం ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తానూ రోడ్డు ప్రమాద బాధితుడినే అని తెలిపారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లోక్ సభలో సమాధానం ఇచ్చారు. దేశంలో ఏడాది కాలంలో 1.68 లక్షల మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని... ఇందులో 60 శాతం మంది యువకులే ఉన్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తన కాలు విరిగినట్లు చెప్పారు. అందుకే ఈ అంశం తనకు చాలా ప్రత్యేకమైనదని అన్నారు. ప్రజాప్రతినిధులు, మీడియా, ప్రజల సహకారం లేకుండా రోడ్డు ప్రమాదాలు తగ్గించడం సాధ్యం కాదన్నారు. జరిమానాలు ఎంత పెంచినా ప్రజలు నిబంధనలు పాటించడం లేదని వాపోయారు. రోడ్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సమర్థవంతంగా చట్టాల అమలు, ప్రజలకు అవగాహన... ఈ నాలుగు ముఖ్యమైన అంశాలన్నారు. చాలామంది రెడ్ సిగ్నల్ పడితే ఆగరు... హెల్మెట్ పెట్టుకోరని వాపోయారు. నిన్న తన కళ్లముందే ఓ కారు రెడ్ సిగ్నల్‌ను క్రాస్ చేసిందన్నారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

**ముంబై:** ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎయజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువరు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఫడ్నవీస్ రెండోసారి 2014 నుంచి 2019 వరకు బీజేపీ-శివసేన ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. 2019 ఎన్నికల తరువాత, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన సిఎం పదవి కోసం బిజెపితో సంబంధాలు తెంచుకున్నప్పుడు, ఫడ్నవీస్ తిరిగి అజిత్ పవార్ మద్దతుతో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఎన్సీపీ ఎమ్మెల్యేల నుంచి తగినంత మద్దతు పొందడంలో అజిత్ పవార్ విఫలం కావడంతో ఈ ప్రభుత్వం కేవలం 72 గంటలు మాత్రమే కొనసాగింది. అనంతరం, శివసేనలో చీలిక రావడంతో షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం అయ్యారు.

# ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన సమయంలో పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకుని గచ్చిబౌలికి తరలించారు. హరీష్ రావును ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హరీష్‌రావుపై కేసు నమోదైంది. పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన సమయంలో అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వాహనంలోకి ఎక్కే ముందు హరీష్ రావు తీవ్రంగా ప్రతిఘటించారు. బంజారాహిల్స్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుంటున్నారు. హ?రీశ్ రావుతో పాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు హరీశ్ రావు అరెస్ట్ సందర్భంగా కౌశిక్ రెడ్డి ఇంటిని పోలీసులు ధ్వంసం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఇక కౌశిక్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా..? అని నిలదీశారు హరీశ్‌రావు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే, నాపై, బీఆర్ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారు. అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నావు. నీ పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదు. తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుంది అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాగా ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రశ్నల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లనకు తరలిస్తున్నారు. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి,



ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసులు.. కేసులు.. కేసులు.. ఈ పేర్లతో అటు ప్రజలను, ఇటు ప్రతిపక్షాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాసులు మీకు %-% కేసులు మాకు.. సూటుకేసులు మీకు.. అరెస్టులు మాకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు మా నాయకులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి గార్లతోపాటు మా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం.. తక్షణం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చివరగా జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

## ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

### జనరల్ బోగీలను పెంచనున్న సౌత్ సెంట్రల్ రైల్వే

**న్యూఢిల్లీ:** ఎక్స్ప్రెస్, సూపర్ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రెండే జనరల్ కోచ్ లు ఉన్న రైళ్లలో ఆ సంఖ్యను నాలుగుకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. అవి కూడా ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎల్.హెచ్.బి కోచ్ లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. జోన్ పరిధిలోని 21 జతల రైళ్లకు అదనగా 80 ఎల్.హెచ్.బి బోగీలను అందుబాటులోకి తీసుకొస్తామన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు.

రైళ్లలో పేదలు ప్రయాణించే జనరల్ బోగీల రూపం కూడా మారబోతున్నది. ఇన్నాళ్లు రైళ్లలో పాతకాలం నాటి సాధారణ బోగీలే ఉన్నాయి. చాలా రైళ్లలో రెండే బోగీలు ఉండటంతో పేద ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాని కారణంగా జనరల్ బోగీల సంఖ్యను పెంచేందుకు రైల్వేబోర్డు కార్యాచరణ ప్రారంభించింది. కొత్తగా వస్తున్న జనరల్ బోగీలను ఎల్.హెచ్.బి పరిజ్ఞానంతో తయారుచేసినవి ప్రవేశ పెడుతున్నారు. పాత తరం ఐసీఎఫ్ బోగీల్లో 90 సీట్లు ఉంటే.. ఎల్.హెచ్.బి బోగీల్లో సీట్ల సంఖ్య 100 ఉంటాయి. ఇందులో ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం తక్కువ నష్టం ఉంటుందంటున్న రైల్వే అధికారులు. ఏసీ, స్లీపర్ క్లాస్ లలో మాత్రమే ఎల్.హెచ్.బి బోగీలను రైల్వే శాఖ ప్రవేశపెడుతూ వచ్చింది. కానీ తాజాగా ఇప్పుడు జనరల్ క్లాస్ లలో ఎల్.హెచ్.బి కోచ్ లను

అందుబాటులోకి ఇస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే. ఇప్పటికే జోన్ పరిధిలో 19 ఎక్స్ ప్రెస్ రైళ్లకు ఎల్.హెచ్.బి కోచ్లను 66 కోచ్లను ప్రవేశపెట్టారు. గౌతమి, దక్షిణ్, నారాయణాద్రి తదితర ఎక్స్ప్రెస్ రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి జనరల్ కోచ్ లు వచ్చాయి. రైల్వేశాఖ దేశవ్యాప్తంగా 370 రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి బోగీలను దశలవారీగా జత చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫలితంగా రోజూ అదనంగా 70 వేల మంది ప్రయాణికులు జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు ఆస్కారం ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

# తప్పులు చేస్తే ఉపేక్షించం

హైదరాబాద్:యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్?పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్?గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్?లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్?ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్?కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు. ఎవరూ తప్పులు చేసినా ఉపేక్షించమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నల్లో తప్పులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ పదవిలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రిపేర్ అయ్యే సమయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కరెక్ట్?గా పనిచేయడంతోనే తనకు ఉద్యోగం వచ్చిందని

గుర్తు చేసుకున్నారు. టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బుర్రా వెంకటేశం

2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నారు. ఐఏఎస్?కు బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ, గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా, జేఎన్?టీయూహెచ్ వీసీగా బుర్రా వెంకటేశం రిలీవ్ అయ్యారు.

# సౌదీలో డ్రగ్స్ కేసులో భారతీయుడికి మరణశిక్ష

మీరట్: మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణల కేసులో ఉత్తర ప్రదేశ్ కు చెందిన ఒక యువకుడికి సౌదీ అరేబియా కోర్టు మరణ శిక్ష విధించింది. యూపీలోని మీరట్ జిల్లాలో ఉన్న ముండాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాచౌటి గ్రామానికి చెందిన మహ్మద్ జైద్ (36)కు సౌదీ అరేబియా కోర్టు మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై మరణశిక్ష విధించింది. డ్రగ్స్ కేసులో 2023 జనవరి 15 నుంచి జైద్ జెడ్డా సెంట్రల్ జైలులో మగ్గుతున్నాడు. సౌదీలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ముండాలి పోలీసులు మంగళవారం రాచౌటి గ్రామంలోని జైద్ కుటుంబ సభ్యులకు ఈ సమాచారం అందించారు. దాంతో, అతని కుటుంబ సభ్యులు షాక్ కు గురయ్యారు. జైద్ తరఫున అతడి కుటుంబ సభ్యులు వాదించాలనుకుంటే, వారు సౌదీ అరేబియా అంతర్గత మంత్రిత్వ శాఖను, సంబంధిత కోర్టును సంప్రదించవచ్చని ఆ నోటీసులో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్న జైద్ 2023 జనవరి 15 నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా సెంట్రల్ జైలులో ఉన్నాడని నోటీసులో పేర్కొన్నారు. మక్కాలోని క్రిమినల్ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. అక్కడ జైద్ కు మరణశిక్ష విధించారు. జైద్ 2018లో సౌదీ అరేబియా వెళ్లి ఓ కంపెనీలో డ్రైవర్ గా పనిచేస్తున్నాడని జైద్ తమ్ముడు మహ్మద్ సాద్ తెలిపారు. సౌదీలో తన సోదరుడు ప్రమాదానికి గురయ్యాడని, ఆ క్రమంలో అతడికి ఆహారం, ఇతర రోజువారీ అవసరాలు తీర్చినందుకు బదులుగా స్థానిక పోలీసు ఒకరు తన సోదరుడిని డ్రైవర్ గా వాడుకుంటున్నాడని మహ్మద్ సాద్ ఆరోపించాడు. భారత్ కు తిరిగి వెళ్తానని తన సోదరుడు పట్టుబట్టడంతో అతడిని తప్పుడు కేసుల్లో ఇరికించారని సాద్ చెప్పారు.

# త్వరలో పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శిస్తా..

**చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరం నిర్మాణ పనులు వేగవంతం**

**కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి**

అమరావతి:చంద్రబాబు సీఎం అయ్యాక పోలవరం నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. త్వరలో పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శిస్తానని కేంద్రమంత్రి తెలిపారు. పోలవరం నిర్మాణానికి ఇప్పటికే చాలా నిధులను అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన సొమ్మును తిరిగి చెల్లిస్తున్నామన్నారు. పోలవరం నిర్మాణానికి ఇప్పటికే చాలా నిధులను అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన సొమ్మును తిరిగి చెల్లిస్తున్నామన్నారు. ఢిల్లీలో గృహప్రవేశం సందర్భంగా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మీడియా ప్రతినిధులకు గురువారం విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రిమంత్రి ఈమేరకు ప్రకటన చేశారు. దీంతో పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి లాంటిదని.. దీనిని 2027 నాటికి పూర్తిచేస్తామని ఢిల్లీలో కేంద్రమంత్రి తెలిపారు. కాగా జనవరి నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభంకాబోతోంది. దీన్ని 2026 మార్చి కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 70వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. గోదావరి -కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం కూడా ఉండబోతోంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగాయి. అయితే రివర్స్ టెంటర్ కారణంగా పదిహేడు నెలల పాటు నిలిచిపోయాయి. జగన్ పాలనలో ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగని పరిస్థితి. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 71.93శాతం 2014-2019 మధ్య టీడీపీ హయాంలో పూర్తి అయితే.. ఆ తరువాత ప్రభుత్వ హయాంలో కేవలం 3.84 శాతం మాత్రమే పూర్తి అయ్యాయని పార్లమెంటులో గణాంకాలను అందజేశారు. 2024-25లో రూ.12,500 కోట్లు నిధులపై కేంద్రం దృష్టిసారించింది. ఈ నిధులతో డయాఫ్రంవాల్‌తో పాటు పలు కీలకమైన పనులను పూర్తి చేయనున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయితే గోదావరి -కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం కూడా పూర్తి అవుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదనేది కేంద్రం మాట. పాత డయాఫ్రం వాల్ నష్టపోవడంతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.1200 కోట్లు అవసరం అవుతాయని కేంద్రం అంచనా వేసింది. అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ కోసం రూ.31,500 కోట్లు అవసరం అవుతాయని సర్కార్ నిర్ణయించింది.

దాన్ని కూడా ఇచ్చేందుకు కేంద్రం ముందుకు వచ్చింది.

వరదల సమయంలో నీటి లీకేజ్ ప్రధాన సమస్యగా ఉండటంతో దీనికి నూతన సాంకేతికతను ఉపయోగిం చనున్నారు. 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ నిధులు సరైన విధంగా వినయోగించలేదని విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే కాకుండా 28.5 లక్షల మందికి తాగు నీరు అందుతుంది.

వేగుచుక్క

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, డిసెంబర్ 5:**

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థులు ఎంపిక అయ్యారు. తెలంగాణ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అధ్వర్యంలో ఈ నెల 7 నుండి 9 వరకు ఆర్మూర్ లోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్ 17) సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారు. గత నెల 9న ఆర్మూర్ లో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాల విద్యార్థులు సిద్దార్థ, రేవంత్ లను గురువారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆర్



నర్సయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల కూడా ముఖ్యమని మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయాన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేడేటా ఎంట్రీలో వార్డ్ నెంబర్లను సరిచేయాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 5:**

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ లో వార్డ్ నెంబర్లను సరిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుండి ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, ఆర్డీఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ లో వార్డ్ నెంబర్లను తప్పుగా నమోదు చేయడం జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఓటరు జాబితా ప్రకారం ఇంటి నెంబర్ ల ప్రకారం వార్డ్ నెంబర్ వేయడం లను ఈ రోజు లోగా సరిచేసుకొని, సాఫ్టువేర్ అందుబాటులోకి రాగానే సరిచేయాలని తెలిపారు. ఇందుకు పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, వార్డ్



నెంబర్లను సరిచేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ వార్డ్ లోని నెంబర్లను కూడా సరిచేసుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజక వర్గం లోని పెండింగులో ఉన్న దేర్పఖాస్తులను పరిశీలించి ప్రాసెస్ చేయాలని తహసీల్దార్లు, ఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఎస్ఎస్ఆర్ క్రింద ఫారం 6,7,8, లు లాగిన్ లో ఉన్న వాటిని తహసీల్దార్లు, ఆర్డిఒ లు ఆయా ఫారాలను ప్రాసెస్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, సీపీఒ రాజారాం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిజిఎచ్ లో పోస్టర్ల ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 5:**




ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా గురువారం జిజిహెచ్ లోని ఎఆర్టి సెంటర్లో రోగులకు సమాచారం అందించే పోస్టర్లను విడుదల చేశారు. దీనిలో ముఖ్యంగా ఏఆర్టీ సెంటర్ కి వచ్చే రోగులకు సంబంధించిన విషయాలు, పలు సూచనలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఈ పోస్టర్లు సూచిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ దేవి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఘన స్వాగతం

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 5**



జిల్లా పర్యటనకు హాజరైన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని గురువారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకోగా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్లతో సీఈఓ అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయి స్థానిక అంశాలపై చర్చించారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

## - పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు బిఎల్ పి ఆధ్వర్యంలో వినతి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 5:**

నగరంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత కోరారు. ఈ మేరకు గురువారం హైదారాబాద్ లో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్ శివారు ప్రాంతమైన గిరిరాజ్ కాలేజీ పక్కనగల సర్వే నెంబర్ 168లో గల ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోగల పూలే అంబేద్కర్ నగర్ బస్తీ ప్రజల నుండి వినతి పత్రం తీసుకున్న అనంతరం పిసిసి చీఫ్ జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటి సభ్యులు దడ్వాయి స్వామి, కిషోర్, స్వాతి, చంద్ర గౌడ్, శాంత బాయి, రాధా పాల్గొన్నారు.

# లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి.

## - ఇన్‌ఛార్జి సీపీ సింధుశర్మ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 5:**



అధికారులు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని ఇన్‌ఛార్జి సీపీ సింధుశర్మ సూచించారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఇన్‌ఛార్జి సీపీ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "అవార్డులు" మరింత బాధ్యత పెంచుతాయి.

**హరిదా మహాసభలో ప్రముఖ కవి విమర్శకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి.**

**వైభవంగా సరస్వతీరాజ్ పురస్కారాల ప్రదానం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 5:**



సరస్వతీ రాజ్ హరిదా తెలంగాణ విశిష్ట స్థాయి సాహిత్య పురస్కారం తనకు ప్రకటించడం వల్ల ఎంతో ఆనందం కలిగిందని, దానితో పాటు బాధ్యత పెరిగిందని ప్రముఖ కవి విమర్శకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి నవ్యభారతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో జరిగిన హరిదా రచయితల సంఘం ఆరవ మహాసభలో ఆయన మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో ఎంతో కృషి చేసిన డాక్టర్ సామల సదాశివ, నందిని సిద్ధారెడ్డి, ఆచార్య ఎన్. గోపి వంటి ప్రముఖులు ఐదుగురు ప్రతిభామూర్తులకు ఈ అవార్డు అందజేశారని, ఆరవ వ్యక్తిగా తనకు అందించడం అంటే నా కృషి పట్ల, నా బాధ్యత పట్ల నిజామాబాద్ సాహిత్య లోకానికి ఉన్న నమ్మకం అని తాను నమ్ముతున్నానన్నారు. రాష్ట్ర సాహిత్య చరిత్రలో నిజామాబాద్ వేదికగా హరిదా చేస్తున్న కృషి, సరస్వతి రాజ్ అవార్డుల ప్రదానం సాహిత్యకారులకు వెన్నుదన్నుగా ఉంటున్నాయని అభినందించారు.

కార్యక్రమంలో కీలక ప్రసంగం చేసిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ కవితా సృజనలో, విమర్శ రచనలో, రూబాయిల రూపకల్పనలో, అపురూప అనువాదాలతో , ఏడు కోలల బాయి అని ఎన్నికల శతకంతో తెలుగు సాహిత్య రంగంలో తెలంగాణ వీరుడిగా ఏనుగు నరసింహారెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. హరిదా వారిని గౌరవించడం సముచితం అన్నారు.




కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్ష కులు డాక్టర్ ప్రతిమా రాజ్ మాట్లాడుతూ సాహిత్య కారులు సమాజానికి చేస్తున్న సేవ గొప్పదని, మొత్తం సాహిత్యకారుల కోసం ఒక ప్రత్యేకంగా రోజును ప్రకటించి పండగలాగా జరపాలని సూచించారు. తనకు అవకాశం ఇస్తే జిల్లా సాహితీవేత్తల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తానని తెలిపారు. సరస్వతి రాజ్ పురస్కార ప్రదాత క్యాతం సంతోష్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో జీవితాలు ఎలా ఉజ్వలమ వుతాయో తమ తల్లిదండ్రులు నేర్పారని అందుకే ఈ స్థాయిలో ఉన్నామని అందుకే తాము సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ భాషలో కవితా రచన పోటీలు నిర్వహిస్తామని, తెలుగు మాండలికాలలో రాసిన కథా సంపుటాలకు పోటీలకు ఆహ్వానించి నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న పంచ రెడ్డి లక్ష్మణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ, తెలంగాణలో సాహిత్య వికాసంలో హరిదా రచయితల సంఘం పాత్ర గణనీయమన్నారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన ఇందూర్ అన్నమయ్య వీ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైతే సాహిత్యంలో నిరంతర కృషి జరుగుతుందో అక్కడ ప్రజలు చైతన్యవం తులుగా ఉంటారని, అక్కడ ప్రగతి తో పాటు నైతిక విలువల ఉద్దీపన కొనసాగుతుందని అన్నారు. తెలుగు సాహిత్యంలో హరిదా పాత్ర అమోఘం అన్నారు. జిల్లాస్థాయి హరిదా సరస్వతీ రాజ్ పురస్కారాలను అన్యం పద్మజా రెడ్డి, కామినేని రేణుక, మఠం సుజాత, పి లక్ష్మణ్, మల్లవరపు చిన్నయ్య లకు అతిథులు బహుకరించారు. 40 మంది కవులతో కవి సమ్మేళనం అలరించింది. ఈ కార్యక్రమంలో దారం గంగాధర్ రచించిన సమాంతర రేఖలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీనివాస్ ఆర్య, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ గంట్యాల ప్రసాద్, జి నరసింహస్వామి, నరాల సుధాకర్, కందకుర్తి యాదవరావు, డాక్టర్ శిరీష్, డాక్టర్ సవితా రాణి, జిల్లా సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు


# పార్టీల మధ్య గీతం, తెలంగాణ తల్లి విగ్రహం లోల్లి

హైదరాబాద్:రాష్ట్రానికి అయినా రాష్ట్ర గీతం ఒకటే ఉంటుంది. ఆరాధించే తల్లి కూడా ఒకటే ఉంటుంది. కానీ తెలంగాణకు వచ్చేసరికి సీన్ మారుతోంది. మీ తల్లే మీదే..మా తల్లి మాదే. మీ గీతం మీదే..మా గీతం మాదే అన్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రభుత్వం చెప్పిన మాట అపోజిషన్ వినదు. అప్పటి ప్రభుత్వం రూపొందించిన వాటిని ఇప్పటి ప్రభుత్వం ఒప్పుకోదు. దీంతో రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా లొల్లి కంటిన్యూ అవుతోంది. ఇంతకీ రెండు తల్లులు, రెండు రాష్ట్ర గీతాల లొల్లి పతాకస్థాయికి చేరింది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం..రాష్ట్ర చిహ్నం, రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్‌పై టీఎస్ అని పెట్టేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కథ మొదటికి వచ్చింది. అధికారి పార్టీ తెలంగాణ తల్లిని ఓ రూపంలో కొలుస్తుంటే..అపోజిషన్ బీఆర్ఎస్ తాము ముందుగా రూపొందించిన తెలంగాణ తల్లినే ఆరాధిస్తుంది. ఇక రాష్ట్ర గీతం పరిస్థితి కూడా అంతే. జయజయహే తెలంగాణ విషయంలోనూ ఎవరి గీతం వారిదే అన్నట్లు అయిపోయింది సిచ్యువేషన్. మీ బీఆర్ఎస్ తల్లి మీదే, మా కాంగ్రెస్ తల్లి మాదే అన్నట్లుగా మరో తెలంగాణ తల్లి విగ్రహం సిద్దం చేయిస్తున్నారు సీఎం రేవంత్. కేసీఆర్ తయారు చేయించిన తెలంగాణ తల్లి



విగ్రహంలో ఆయన కూతురు కల్వకుంట్ల కవిత పోలికలు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి విమర్శించే వారు. తెలంగాణ తల్లి అంటే గడిలో ఉండే రాణీగారు కారని, రాష్ట్రంలో సామాన్య ప్రజలకు ప్రతీకగా ఉండాలంటూ చెప్పుకొచ్చారు. అప్పుడు మాట్లాడినట్లుగానే ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మారుస్తున్నారు. డిసెంబర్ 9న సెక్రటేరియట్‌లో కొత్త రూపంలో తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది ప్రభుత్వం. ఇప్పటికే విగ్రహ తయారీ క్లైమాక్స్‌కు చేరుకున్నట్లు తెలుస్తోందితెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తున్నారు గులాబీ నేతలు. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ విగ్రహాన్ని మారుస్తున్నారని మండిపడుతున్నారు. కొత్త తెలంగాణ విగ్రహంలో సోనియా గాంధీ రూపం కనిపిస్తోందని విమర్శిస్తోంది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే డిసెంబర్ 9న కొత్త రూపంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టబోతున్నారు సీఎం రేవంత్. బీఆర్ఎస్ మాత్రం తాము మొదటి నుంచి ఆరాధిస్తున్న తెలంగాణ విగ్రహ రూపాన్నే అదే రోజు మేడ్చల్‌లో ఏర్పాటు చేస్తామంటోంది. ఇలా ఎవరి తల్లి వారిదే అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. బీఆర్ఎస్ హయాంలో రూపొందించి తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ సర్కార్ ఒప్పుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ చేస్తున్న కొత్త తెలంగాణ తల్లి రూపాన్ని బీఆర్ఎస్ ఒప్పుకోవడం లేదు. ఇలా ఎవరికి తోచినట్లుగా వారు తెలంగాణ తల్లిని ఆరాధిస్తున్నారు. రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ విషయంలోనూ ఇదే రచ్చ జరుగుతోంది. పాత పాటనే తమ పార్టీ సమావేశాల్లో ఆలపిస్తూ వస్తోంది బీఆర్ఎస్. కాంగ్రెస్ నేతలు మాత్రం తాము అధికారంలోకి వచ్చాక మార్చిన గీతాన్ని ఫాలో అవుతున్నారు. వాహనాల నెంబర్ల ప్లేట్‌పై టీఎస్, టీజీ విషయంలోనూ ఎవరూ తగ్గడం లేదు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం మార్చినప్పుడు కూడా బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా ఎవరూ తగ్గడం లేదు. పదేళ్లు ఓ రూపంలో తెలంగాణ తల్లిని, గీతాన్ని ఆలపించిన జనాలకు ఇప్పుడు కొత్త తల్లి, కొత్త గీతం అందుబాటులోకి తేవడం ఏంటన్న చర్చ తెరమీదకు వస్తోంది. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతం మీద ఈ పంచాయితీ ఏంటని ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలకు పోయి రాష్ట్ర పరువు తీస్తున్నారని మండిపడుతున్నారు ఉద్యమకారులు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల పాలన పూర్తయ్యాక..ఇప్పుడు ఎవరి తల్లి వారిదే..ఎవరి గీతం వారిదే అని నడుచుకుంటూ వెళ్తే ఎలా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఊరూరా పాత తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏంటని అడుగుతున్నారు. ఏ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఫాలో కావాలి..ఏ గీతాన్ని ఆలపించాలో సాధారణ ప్రజలకు అర్థం కావట్లేదని..ఈ కన్ఫ్యూజన్‌కు ఎండ్ కార్డ్ వేయాలని కోరుతున్నారు. తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతంపై అధికార, విపక్షాల పట్టుదలలు ఎంతవరకు వెళ్తాయో చూడాలి మరి.



## గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ

యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘డాకు మహారాజ్’ షూటింగ్ పూర్తి

షూటింగ్ పూర్తి చేసుకున్న ‘డాకు మహారాజ్’ చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న భారీస్థాయిలో విడుదల అపజయమెరుగకుండా వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, ప్రతి చిత్రంతోనూ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నారు. బాలకృష్ణ తన తదుపరి చిత్రం ‘డాకు మహారాజ్’ను బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. కేవలం ప్రకటనతోనే ‘డాకు మహారాజ్’ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ప్రచార చిత్రాలతో ఈ చిత్రంపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇటీవల విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. నందమూరి అభిమానులతో పాటు, సాధారణ ప్రేక్షకుల్లోనూ ఈ సినిమా చూడాలనే ఆసక్తి రోజురోజుకి పెరుగుతోంది. తన చిత్రాలలో కథానాయకులను సరికొత్తగా చూపించడంలో దర్శకుడు బాబీ కొల్లి దిట్ట.

# ‘పా..పా..’ బ్లాక్ బస్టర్ షేకా



తమిళ బ్లాక్ బస్టర్ మూవీ డా..డా’ మూవీ తెలుగులో ‘పా.. పా..’ టైటిల్‌తో జెకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ఈ మూవీ ఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఆ సందర్భంగా తాజాగా ‘పా.. పా..’ మూవీ ట్రైలర్‌ను క్రేజీ డైరెక్టర్ మారుతి విడుదల చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. తమిళ సెన్సేషనల్ మూవీ ‘డా..డా’ తెలుగులో ‘పా.. పా..’ పేరిట విడుదలవ్వడం సంతోషంగా ఉందని, ఈ సినిమా తెలుగులోనూ బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సబ్జెక్ట్ తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందన్నారు. ‘పా.. పా..’ చిత్రయూనిట్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

గత ఏడాది తమిళంలో ‘డా..డా’ మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన ‘డా..డా’ చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది. హార్ట్ టచ్ అయ్యే పాటలు ఈ సినిమాకు మరో హైలైట్ అని చెప్పుకోవచ్చు. ఒకప్పటి పాపులర్ సాంగ్స్ మాదిరిగానే ఈ సినిమా పాటలు స్థిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలోని పాటలు చాలా హైలెట్ గా నిలుస్తాయని అన్నారు.

తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన ‘డా..డా’ చిత్రం ‘పా.. పా..’ పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత నీరజ కోట తెలిపారు. భావోద్వేగం, ప్రేమ, కామెడీ.. ఇవన్నీ సరైన స్థాయిలో మిక్స్ చేసిన ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా.. తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్టు అవుతుందని, బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేయబోతున్నారని చెప్పారు.

# ‘యుఫోరియా’

## సెకండ్ షెడ్యూల్ ప్రారంభం

## బ్లాక్ బస్టర్ మూవీ ‘ఒక్కడు’ కాంబో..

**20 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి పని చేస్తోన్న డైరెక్టర్ గుణశేఖర్, నటి భూమిక..**

వైవిధ్యమైన, హిట్ సినిమాలకు పెట్టింది పేరైన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణశేఖర్ ప్రస్తుతం యూత్‌ఫుల్ సోషల్ డ్రామా ‘యుఫోరియా’తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దురాగతాలపై తెరకెక్కుతోన్న సినిమా అని అనౌన్స్ చేసినప్పటి నుంచి అందరిలోనూ సినిమా ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవల విడుదలైన మూవీ గ్లింప్స్‌తో సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ రేంజ్‌కు చేరుకున్నాయి.

ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. రీసెంట్‌గా ఫస్ట్ షెడ్యూల్ చిత్రీకణ పూర్తయ్యింది. అదే యుఫోరిక్ ఎనర్జీతో మేకర్స్ ఇప్పుడు సెకండ్ షెడ్యూల్ షూటింగ్‌ను స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ ఇస్తూ సెట్స్ నుంచి ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో ఎవర్‌గ్రీన్ బ్యూటీఫుల్ యాక్ట్రెస్ సెట్స్‌లో మనకు కనిపించారు. ఆమె మేకప్ వేసుకోవటం,




షూటింగ్‌లో పాల్గొనటం వంటి సన్నివేశాలను మనం ఆ వీడియోలో చూడొచ్చు. ఆమె రాకతో ఆ సెట్స్‌కు మరింత ఉత్సాహం వచ్చింది. ఈ గ్లింప్స్ వీడియోలో వెర్సటైల్ డైరెక్టర్ గుణశేఖర్‌గారిని మనం గమనించవచ్చు. 20 ఏళ్ల క్రితం గుణ శేఖర్, భూమిక సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ ఒక్కడు మూవీలో కలిసి పని చేసిన సంగతి తెలిసిందే. యుఫోరియా కోసం మరోసారి ఈ బ్లాక్ బస్టర కాంబో చేతులు కలిపింది.

భూమికను దృష్టిలో ఉంచుకుని గుణశేఖర్ ఓ పవర్‌ఫుల్ రోల్‌ను క్రియేట్ చేశారు. ఇప్పుడు విడుదల చేసిన గ్లింప్స్ చూస్తుంటే పవర్‌ఫుల్ రోల్‌లో భూమిక ఎ లా మెప్పించనున్నారోనని ఆసక్తి మరింత పెరిగింది.

# శోభిత.. చైతూ పెళ్లికి

## గెస్ట్ లిస్ట్‌లో ఉన్నది వీరే...!





అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆయన పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం ఇవాళ నటి శోభితతో జరగనున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్‌లో వీరి వివాహం పూర్తి సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. దాదాపు 8 గంటలపాటు పెళ్లి తంతు జరగనున్నట్లు తెలిసింది. ఇక ఈ వేడుకకు అక్కినేని, దగ్గుబాటి కుటుంబాలతోపాటు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరుకానున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ఈ వేడుకకు హాజరుకాబోతున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా అగ్ర కథానాయకులు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్..ఉపాసన, మహేశ్ బాబు..నమ్రత, ప్రభాస్, లేడీ సూపర్ స్టార్ నయనతార, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సహా పలువురు అగ్ర తారలు, దర్శకులు హాజరుకానున్నారు. పెళ్లి వేడుకలో భాగంగా ఇటీవలే కాబోయే కొత్త జంటకు హల్దీ వేడుకలు నిర్వహించిన విషయం తెలిసిందే. చై-శోభిత జంటను ఒకేచోట ఉంచి మంగళస్నానాలు చేయించారు.

అనంతరం శోభితను పెళ్లి కూతురిగా ముస్తాబు చేసి మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎరుపు రంగు చీరలో శోభిత మెరిసిపోతున్న ఫొటోలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఇక పెళ్లిలో శోభిత బంగారు జరీ వర్క్‌తో కూడిన కాంచీవరం చీరను ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. కాబోయే కోడలికి నాగార్జున ఖరీదైన కారు బహుమతిగా ఇవ్వబోతున్నట్లు తెలిసింది. ఇటీవలే నాగ్ రూ.2.75 కోట్లతో లెక్సస్ లగ్జరీ కారును కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ కారును కొడుకు, కోడలికి గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నట్లు సమాచారం. దీంతోపాటు బంగారు ఆభరణాలు ఇలా ఖరీదైన బహుమతులు శోభిత కోసం సిద్ధం చేసినట్లు టాలీవుడ్ సర్కిల్ నుంచి టాక్.

# తుది దశకు చేరిన ‘ది గర్ల్ ఫ్రెండ్’



చిత్రటీంకు సుకుమార్ శుభాకాంక్షలు

రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రేమకథాచిత్రం ‘ది గర్ల్ ఫ్రెండ్’. దీక్షిత్‌శెట్టి కథానాయకుడు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నారు. రీసెంట్‌గా టీజర్ చూసిన అగ్ర దర్శకుడు సుకుమార్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రష్మిక క్లోజప్ షాట్స్, ఆమె హావభావాలు బాగున్నాయని, దర్శకుడు సరైన యాక్టర్స్‌ని సెలక్ట్ చేసుకున్నాడని సుకుమార్ అభినందించారు. ఈ చిత్రానికి కెమెరా.. కృష్ణన్ వసంత్, సంగీతం.. హేషమ్ అబ్దుల్ వాహబ్, సమర్పణ..అల్లు అరవింద్, నిర్మాణం.. గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటైర్టైన్మెంట్స్. ఇదిలావుంటే.. రష్మిక నటించిన తాజా చిత్రం ‘పుష్ప-2’ ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఆమె హిందీలో ఛావా, సికందర్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# జాట్ మాస్ట్ ఫీస్ట్

గోపీచంద్, సన్నిడియోల్ ఇంట్రెస్ట్ న్యూస్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని బీటౌన్ డెబ్యూ ఇస్తున్నాడని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా ఎస్‌డీజీఎంగా రాబోతున్న ఈ చిత్రానికి జాట్ టైటిల్‌ను ఫైనల్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఇప్పటికే మాస్ ఫీస్ట్ లోడింగ్ అంటూ మేకర్స్ లాంచ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. బుధవారం సాయత్రం 4:05 గంటలకు ఎక్జయిటింగ్, భారీ అనౌన్స్‌మెంట్ అంటూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బీటౌన్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. రిషి పంజాబి సినిటోగ్రాఫర్ కాగా.. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు.




# నెత్తుడి పిడికిలి

## బిగించిన చిరంజీవి

శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్

ప్రస్తుతం విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి. సోషియా ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగా.. మరోవైపు దసరా ఫేం శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. అలా అప్‌డేట్ ఇచ్చేశారో లేదో..? సినిమా ఉండబోతుందోనని ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న అభిమానులకు స్టన్నింగ్ ఫొటోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.మెగాస్టార్ చిరంజీవితో పిడికిలి బిగించిన స్టిల్‌ను షేర్ చేశాడు. బ్యాక్‌డ్రాప్‌లో చిరు, శ్రీకాంత్ ముఖాలను కనిపించకుండా.. నెత్తుటితో పిడికిలి బిగించిన స్టిల్‌ను హైలెట్ చేస్తూ తీసిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. సినిమా వయోలెన్స్‌గా (హింసాత్మకంగా) ఉండబోతుందని ట్వీట్ చేశాడు. ఒక్క స్టిల్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. శ్రీకాంత్ ఓదెల ఓ వైపు నానితో రెండో సినిమాను డైరెక్ట్ చేస్తూనే.. మరోవైపు మెగాస్టార్ సినిమాను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టులో చిరంజీవిని చాలా ఫ్రెష్ లుక్‌తో నయా అవతార్‌లో చూపించబోతున్నాడట.

